క్లుప్తంగా

మంచినీటి కోసం నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లో మూడు రోజుల నుంచి మంచినీరు రావడం లేదని ప్రజలు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపులు లీకేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యను ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం లేదన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధి దృష్టి తీసుకెళ్లినా లాభం లేదన్నారు. చివరకు తామే స్వయంగా మంచినీటి ట్యాంకర్లను నింపుకొని తీసుకెళ్లామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో గంభీరావుపేట ప్రశాంత్, బాలకిష్టయ్య, మహేశ్, శివ, రాకేశ్, అక్షయ్, ఉమేశ్, రుక్కవ్వ, కనకవ్వ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం


మిడిల్ పోల్స్ పనులు ప్రారంభిస్తున్న డైరెక్టర్

ముస్తాబాద్: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. మండలంలోని మోహినికుంటలో పంట పొలాల్లో లూజ్ విద్యుత్ తీగలను సరిచేసే మిడిల్స్ పోల్స్ పథకాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. సెస్ పరిధిలోని రైతులకు నాణ్యమైన కరెంట్ అందించేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. రైతులు వ్యవసాయ కనెక్షన్లను తీసుకుని, ఉచిత విద్యుత్ సేవలను పొందాలని కోరారు. సర్పంచ్ కల్వకుంట్ల వనజ, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, ఉపసర్పంచ్ సంధ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సతీశ్, బాపురావు, దేవయ్య, నర్సింలు, మారుతి, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సహ విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయాన్ని అందిస్తున్న సహ విద్యార్థులు

కోనరావుపేట: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తోటి విద్యార్థి కుటుంబానికి అతని సహవిద్యార్థులు రూ. లక్ష ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన ముష్మం రమేశ్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రమేశ్‌తో కలిసి చదువుకున్న తోటి విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులంతా కలిసి రూ.లక్ష విరాళం జమ చేశారు. ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వంగపెల్లి శ్రీనివాస్, గుండా తిరుపతి, నల్ల తిరుపతి, వెలిశాల లక్ష్మణ్, పర్శ రాములు, విజయ్‌బాబు, రాజు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా..

- పనులు పూర్తికా ముందే శిథిలావస్థలోకి స్త్రీశక్తి భవనం
- ఇబ్బందిపడుతున్న మహిళా సంఘాలు
- రూ.32 లక్షలు బూడిద పోసిన పన్నీరేనా?
- మరో రూ.10 లక్షలకు పనులు పూర్తి


అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు


ధ్వంసమవుతున్న ఫ్లోరింగ్

చందుర్తి: మహిళా సాధికారత కోసం ప్రభుత్వం మండలానికి ఒక స్త్రీ శక్తి భవనాన్ని మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణం పనులు నత్తనడకనతో ఏళ్లు గడిచినా అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఏటా అంచనా వ్యయం పెరగడంతో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25 లక్షలతో పనులు పూర్తికాలేదు. దీంతో అదనంగా మరో రూ.7 లక్షలు తిరిగి మంజూరు చేశారు. ఎనిమిదేళ్లుగా ఆగుతూ.. సాగుతూ పనులు పూర్తికాకుండానే ఉంది. ఎస్ఆర్‌జీఎస్ నిధుల నుంచి 2014లో రూ.25 లక్షలతో ఈ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులే ఈ పనులు చేయించే బాధ్యతను తీసుకున్నారు. పనులను గడువులోపు పూర్తిచేయకపోవడంతో అంచనా వ్యయం పెరిగింది. వీటిని పూర్తిచేసేందుకు అదనంగా మరో రూ.7 లక్షలు మంజూరు చేయించుకున్నారు. అప్పటికీ పనులు చేయకపోవడంతో అంచనా వ్యయం పెరడంతో ఇచ్చిన నిధులు సరిపోక అంతవరకే పనులు చేసి చేతులు దులుపుకున్నారు.

సమావేశాలకు తప్పని తిప్పలు

మండలంలోని 19 గ్రామాల్లో 29 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటిలో 9,115 మంది సభ్యులు ఉన్నారు. గ్రామాల్లోని 29 గ్రామైక్య సంఘాల్లోని ఇద్దరు సభ్యులతో ప్రతినెలలో రెండుసార్లు సమావేశాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రతి సమావేశంలో 50 మందికి పైగా సభ్యులు ఉండడంతో ఐకేపీ కార్యాలయంలో ఇరుకు గదిలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. అంతేకాకుండా మహిళలకు కావాల్సిన సౌకర్యాలు లేకపోవడంతో సమావేశానికి హాజరయ్యేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తమ భవనాన్ని పూర్తిచేయాలని మండల ప్రజాప్రతినిధులకు మహిళలు మొరపెట్టుకున్న వారి ఆవేదనను పట్టించుకునే వారే లేకుండా పోయారని వాపోతున్నారు.

పూర్తికాక ముందే శిథిలావస్థకు..

ఇప్పటికి రూ.32 లక్షలు మంజూరు చేసిన పనులు పూర్తి కాలేదు. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో పనులు పూర్తయినా, చందుర్తిలో అసంపూర్తిగా మిగిలిపోయాయి. భవన పనులు 8 ఏళ్లుగా కొనసాగుతుండడంతో చేసిన పనులు పగుళ్లు బారాయి. గోడలు, తలుపులు, కిటికీలు ఎక్కడిక్కడే ఊడిపోయేలా కనిపిస్తున్నాయి.

ఇబ్బంది పడుతున్నం



స్త్రీ శక్తి భవనం నిర్మిస్తున్నారని ఇబ్బంది ఉండదని భావించాం. ప్రస్తుతం ఐకేపీ ఆఫీసులో ఇరుకు గదిలో కూర్చుండాల్సి వస్తుంది. ప్రతి సమావేశంలో ఈ విషయం అడుగుతున్నా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నామని చెబుతున్నారు.
– కీసరి మంజుల, మండల సమైఖ్య సంఘం అధ్యక్షురాలు, చందుర్తి

పనులు పూర్తిచేయాలి



భవన నిర్మాణం పూర్తి చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారుల, మండల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాను. నిధులు మంజూరు చేయించి అసంపూర్తి పనులను పూర్తిచేయాలని ఎమ్మెల్యేను కూడా కోరాం.
– పులి రేణుక, ఎంపీటీసీ, చందుర్తి

నిధులు మంజూరు కావాలి



కేటాయించిన నిధులు సరిపోక నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. అదనపు నిధుల మంజూరు కోసం ఏడాదికాలంగా వేచి చూడాల్సి వచ్చింది. అదనంగా రూ.10 లక్షలు అవసరం. నిధులు మంజూరైతే పనులు పూర్తి చేయిస్తాం.
– వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ, చందుర్తి

బోనమో పోచమ్మ


ఇల్లంతకుంట: బోనాలతో మహిళలు

ఇల్లంతకుంట/చందుర్తి/ఎల్లారెడ్డిపేట: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగాపండాలని కోరుతూ ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు, వంతడ్పుల గ్రామంలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు మహిళలతో కలిసి బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మతల్లికి బోనాలు తీశారు. బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి , రెడ్డి సంఘం నాయకులు ఏనుగు లచ్చిరెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం ఉపేందర్‌రెడ్డి, నడిపి చంద్రారెడ్డి, గడ్డం సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఎడ్లబండ్లతో గ్రామ దేవత ఆలయాల చుట్టూ తిరుగుతూ రైతులు మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


పోచమ్మ బోనాలతో బీఆర్ఎస్ నాయకులు మనోహర్‌రెడ్డి, రెడ్డి సంఘం మహిళలు

దళితబంధును సద్వినియోగం చేసుకోవాలి

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు


మినీ స్టేడియం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వేములవాడరూరల్: ప్రభుత్వం దళితుల కోసం ఏర్పాటు చేసిన దళితబంధును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కోనాయపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో మంజూరైన దళిత యూనిట్లను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ సెస్ డైరెక్టర్ రాజు, పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్లు, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, జడల లక్ష్మి, యాచమనేని శ్రీనివాస్, నాయకులు నామాల లక్ష్మిరాజం, కొండ కనకయ్య, గూడూరి మధు పాల్గొన్నారు.

స్టేడియం పనులు పరిశీలన

వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని రూ. 5 కోట్లతో నిర్మాణం జరుగుతున్న మినీ స్టేడియం పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించి మాట్లాడారు. ఆగస్టు 15లోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. స్టేడియం పక్కన డ్రెయినేజీ నిర్మాణానికి కలెక్టర్ నిధులు మంజూరుకు సుముఖంగా ఉన్నారరని, ఆ పనులు త్వరలో చేపడుతామన్నారు. అగిన స్టేడియం పనులకు రూ.5 కోట్లు మంజూరు చేసినందుకు మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు జడల లక్ష్మి, నీలం కల్యాణి, జోగిని శంకర్ పాల్గొన్నారు.

ఎన్ని రోజులు ఈ గోస



ఈ యాసంగి సీజన్‌లో అన్నదాతల కొనుగోలలు కష్టాలు తీరేలా కనపడుతలేవు. రోహిణి కార్తె వచ్చి 10 రోజులు గడిచి వర్షాకాలం వానలు మొదలయ్యాయి. ఇప్పటికే రెండుసార్లు వర్షాలు పడ్డాయి. అయినా అన్నదాతల ధాన్యం కొనుగోళ్లు పూర్తికాక ఇంకా ధాన్యం కుప్పలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయి. ఆదివారం సాయంత్రం వర్షం రావడంతో ధాన్యం, బస్తాలు తడవకుండా అన్నదాతలు తమ ధాన్యం, తూకం వేసిన బస్తాలపై కవర్లు కప్పేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ఎన్ని రోజులు మాకు ఈ కొనుగోలు కష్టాలు అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా కొనుగోళ్లు పూర్తిచేయాలని వేడుకుంటున్నారు. – రుద్రంగి

రైతాంగానికి అనేక సంక్షేమ పథకాలు



ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం రైతాంగం సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, మాజీ ఏఎంసీ చైర్మన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అందే సుభాష్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 24 గంటల విద్యుత్ సరాఫరాతో పాటు రైతుబంధు, రైతు బీమా, సాగునీటి వనరుల పేరుతో పథకాలను రైతులకు వర్తింపజేయడం జరిగిందన్నారు. రైతు చర్చావేదిక సమావేశాలను విజయవంతం చేసిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సోమవారం సిరిసిల్లలో పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, నాయకులు నర్సింహరెడ్డి, నర్సింలు, అప్పరా, సీత్యానాయక్, బండారి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో సిరిసిల్ల వంశీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ వంశీధర్ ఆధ్వర్యంలో వైద్యులు ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 300 మందికిపైగా హాజరైన వారందరికీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కల్యాణి, ఎంపీటీసీ లలిత, భాను, వేణు, విశ్వనాథ్, మల్లారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నియామకం

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పరశురామ్

బోయినపల్లి: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎడపల్లి పరశరామ్‌ను నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన ఆదివారం ఓ కార్యక్రమంలో ఆయనకు నియామకపత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ నర్సింహచారి, మండల పార్టీ నాయకులకు పరశురామ్ కృతజ్ఞతలు తెలిపారు.

అడ్మిషన్ల కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆడ్మిషన్ల కోసం రూపొందించిన కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వద్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన చేస్తున్నామన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. కళాశాలలో దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు మల్లారెడ్డి, మధు రాజేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో నాణ్యమైన విద్య


ఇంటింటా ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు కోరారు. మండలంలోని హరిదాస్‌నగర్‌లో అందిస్తున్న విద్య, సదుపాయాలపై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సర్కార్ విద్యాలయాల్లోనే అన్ని వసతులతో విద్యా బోధన జరుగుతుందని, ప్రైవేట్‌కు ధీటుగా ఫలితాలు వస్తున్నాయన్నారు. పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ అందించడంతో పాటు విద్యార్థులకు స్టడీ అవర్స్, మానసిక ఉల్లాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమపై నమ్మకంతో పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఉత్సవాలా..?



మాట్లాడుతున్న కోల ఆంజనేయులు

తంగళ్లపల్లి: తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన సీఎం కేసీఆర్ దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబరాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని బీజేవైఎం మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులు ఆరోపించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేశారా, దళితులకు మూడు ఎకరాలు ఇచ్చారా, డబుల్ బెడ్రూం ఇచ్చారా, 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చారా..? అని ప్రశ్నించారు. పోలీసుల పహారాలో రైతు దినోత్సవాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాసమస్యలపై ప్రతిపక్ష పార్టీలుగా పోరాడుతూనే ఉంటామని ఎన్నికలు రాగానే జిమ్మిక్కులు చేయమని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం ఉపాధ్యక్షుడు మంచికట్ల ప్రసాద్, సాయికుమర్, ప్రశాంత్, కన్నె అరుణ్, వాసాల ప్రసాద్, రజనీకాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రాచీన కట్టడాలకు కొత్త కళ

- పురాతనకాలం నాటి బురుజులకు రంగులు
- గ్రామాల్లో ఆకర్షణగా నిలుస్తున్న వైనం


నిమ్మపల్లి నడిబొడ్డులో ఆకర్షణగా ఉన్న బురుజు

కోనరావుపేట: పురాతన కాలంలో నిర్మించిన బురుజులు కొత్త కళ సంతరించుకుంటున్నాయి. ఈ బురుజులకు మరమ్మతులు చేయించి, రంగులు వేయించి అందంగా తయారుచేస్తున్నారు. ప్రాచీన సంపదను కాపాడుకునేందుకు తమవంతు కృషి చేస్తున్నారు. పురాతన కట్టడాలకు కొత్త రూపు రావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని గ్రామాల్లో..

మండలంలోని నిమ్మపల్లి, నాగారం, ధర్మారం, నిజామాబాద్, కొలనూర్ తదితర గ్రామాల్లో ప్రాచీనకాలంలో నిర్మించిన బురుజులు ఉన్నాయి. వీటిని సుమారు 400 ఏళ్ల క్రితం నిర్మించి ఉంటారని అంచనా. అయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండడం విశేషం. కింద నుంచి పైదాకా రాతితో చెక్కిన స్తంభాలను ఇటుకల మాదిరిగా పెట్టుకుంటూ నిర్మించిన బురుజులు నేటికీ ఆకర్షణీయంగా ఉన్నాయి. నిమ్మపల్లి నడిబొడ్డున ఉన్న బురుజు అనేక సంఘటనలకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఇటీవల ఈ బురుజుకు రంగులు వేసి జెండా ఎగురవేశారు.

సైనికులు కాపలా ఉండేవారట



సుమారు 400 ఏళ్ల క్రితం నిర్మించిన ధర్మారంలోని బురుజులపై సైనికులు కాపలా ఉండేవారని అంటారు. రాజుల కాలంలో కోటలకు ఆయుధాలతో పహారా కాసేవారని పెద్దలు చెబుతారు. అలాంటి చరిత్ర కలిగిన ప్రాచీన కోటను మా ఆధ్వర్యంలో మరమ్మతులు చేపటి రంగులు వేశాం. బురుజుపైనే జెండాను ఎగురవేస్తున్నాం.
– గున్నాల అరుణ, సర్పంచ్ ధర్మారం

చరిత్రకు సజీవ సాక్ష్యం



నిమ్మపల్లిలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ బురుజు అన్ని రకాల సంఘటనలకు సాక్ష్యంగా నిలిచింది. నిజాం పాలకులకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమాల్లో భాగంగా ఈ బురుజుపై జెండా ఎగురవేశారని చెబుతారు. నిమ్మపల్లి నడిబొడ్డున ఉన్న పురాతనకాలం నాటి బురుజుకు మరమ్మతులు చేయించి రంగులు వేయించడంతో గ్రామానికే అలంకారంగా మారింది.
– దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్, నిమ్మపల్లి